ప్రజాశక్తి

మంగళవారం 17 అక్టోబర్ 2023

5

విజయనగరం



జాతీయ స్థాయి పోటీల్లో
జిఎంఆర్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- రాజాం

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈ నెల 13,14,15 నుంచి జరిగిన జాతీయ స్థాయి ఈవెంట్ రోబో రంబుల్ 2023లో జిఎంఆర్ ఐటి విద్యార్థులు తమ సత్తాను చాటారు. శాశ్వత్ 2023లో భాగంగా జరిగిన రోబో రంబుల్ ఫైనల్స్‌లో జిఎంఆర్ఐటి విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఈవెంట్‌కు డాక్టర్ బి.అనిల్ కుమార్ మార్గనిర్దేశకుడిగా వ్యవహరించారు. విజేతలకు జీఎంఆర్ఐటీ డైరెక్టర్ ఎడ్యుకేషన్ డాక్టర్.జె.గిరీష్, ప్రిన్సిపల్ సిఎల్‌విఆర్ఎస్‌వి ప్రసాద్ సోమవారం అభినందనలు తెలిపారు.

జిల్లాలో మెజార్టీ అసైన్డ్ భూములు భూస్వాములు, ధనికులు, రాజకీయ నాయకుల చెరలో ఉన్నాయి. ప్రస్తుతం అసైన్డ్ ల్యాండ్స్ రెగ్యులైజేషన్ ద్వారా దళితులకన్నా వాటిని ఆక్రమించుకోవడం లేదా నిబంధనలకు విరుద్ధంగా వారి నుంచి కొనుగోలు చేసినవారికే లబ్ధి చేకూర నుంది. భవిష్యత్తులో ఆర్థికంగా వెనుకబడిన దళితులకు భూములు అప్పగించి, వారి స్వావలంభనకు ప్రయత్నించేందుకు అవకాశం లేకుండా పోతుందనడంలో సందేహం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



పెత్తందారుల చెరలో అసైన్డ్ భూములు

వసపర్చుకునేందుకు ప్రయత్నం
భూముల రెగ్యులైజేషన్‌తో నష్టపోనున్న రైతులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

20ఏళ్ల క్రితం నుంచి దళితుల సాగులోవున్న అసైన్డ్ భూములను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లాలో భూముల వివరాలు సేకరించే పనిలో రెవెన్యూ యంత్రాంగం ఉంది. ముఖ్యంగా విఆర్ఒ, ఆర్ఐ స్థాయిలో గ్రామాల వారీగా అసైన్డ్ భూమి సాగుదారులు ఎవరు? వారికి ఏ సంవత్సరంలో ప్రభుత్వం అప్పగించింది? ముఖ్యంగా 2003కు మునుపు ఇచ్చిన భూమి ఎంత? వాటిని అసైన్డ్ పట్టాదారులే సాగు చేస్తున్నారా? లేక వారి వారసులు సాగు చేస్తున్నారా? అప్పట్లో ఇచ్చిన భూమంతా వీరిచేతిలోనే ఉందా? లేక ఇతరులెవరైనా సాగుచేస్తున్నారా? అన్న కోణంలో భూమి వివరాలు సేకరిస్తున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో ఇప్పటి వరకు 55వేల నుంచి 60వేల ఎకరాలు వరకు అసైన్డ్ భూములు ఉన్నాయని అధికారులు అంచనాగా చెబుతున్నారు. 2003 నాటి ముందు ఇచ్చిన భూములు 33,946 ఎకరాలు ఉన్నట్టుగా గుర్తించారు. ఇందులో అత్యధికంగా బొబ్బిలి రెవెన్యూ డివిజన్లో సుమారు 15,837 మంది దళితులకు 15,258.82 ఎకరాలు ఇచ్చినట్టు రెవెన్యూ రికార్డులు చెపుతున్నాయి. బాడంగి మండలంలో 2905 దళిత కుటుంబాలకు 2772.18 ఎకరాలు, బొబ్బిలిలో 3590 కుటుంబాలకు 4113 ఎకరాలు, మెంటాడలో 175 కుటుంబాలకు 411.99 ఎకరాలు, తెర్లాంలో 3394 కుటుంబాలకు 2246.54 ఎకరాలు, రామభద్రపురంలో 2220 కుటుంబాలకు 2762.10 ఎకరాలు, దత్తిరాజేరులో 1269 కుటుంబాలకు 1278.66 ఎకరాలు, గజపతి నగరంలో 2286 కుటుంబాలకు 1674.27ఎకరాలు చొప్పున అసైన్డ్ భూమి ప్రభుత్వం ఇచ్చింది. మిగిలిన భూమి విజయనగరం, చీపురుపల్లి డివిజన్ల పరిధిలో ఉంది. దాదాపు ఈ భూముల్లో ఎక్కువ భాగం స్థానిక పెత్తందారులు, రాజకీయ నాయకులు, కొంతమంది ప్రజాప్రతినిధుల చేతుల్లో ఉన్నాయి. వీటిని రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆక్రమిత పెత్తందారులంతా సంబంధిత దళితులను లోబరుచుకునే పనిలోవున్నారు. 'ఎంతోకొంతకు అప్పట్లో మీ వద్ద నుంచి కొన్నాం కాబట్టి, ప్రస్తుతం మీ పేరున రెగ్యులర్ చేయించుకుని, ఆ వెంటనే మా పేరున రిజిస్ట్రేషన్ చేయాలి' అంటూ దళితులపై ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. వెనుకాడితే అప్పట్లో రాసుకున్న తెల్లకాగితాలు, బాండ్‌పేపర్లను బయటకు తీస్తామంటూ హెచ్చరిస్తున్నారు. కొనుగోలు కాకుండా మాయమాటలతో భూములను ఆక్రమించుకున్న పెత్తందారులు, రాజకీయ నాయకులు దళితులను మచ్చిక చేసుకుంటున్నారు. అవసరమైతే ఎంతోకొంత ఇచ్చేస్తామని అదిరింపులు, బెదిరింపులు, బుజ్జగింపులు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితి బొబ్బిలి, వేపాడ, మెంటాడ, గంట్యాడ తదితర మండలాల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

దళితులకు అన్యాయం



అసైన్డ్ భూముల రెగ్యులర్ చేయడమంటే వాటిని ఆక్రమించుకున్నవారికి కట్టబెట్టడమే. చాలా వరకు అసైన్డ్ భూములు రాజకీయ నాయకులు, భూస్వాములు, పెత్తందారుల ఆధీనంలో వున్నాయి. ఎంతోకొంత ముట్టజెప్పి చాలా కాలం నుంచీ సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దళితులకు రిజిస్ట్రేషన్ కాగానే, వారి నుంచి సాగుదారులైన పెత్తందారులకు ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉంటాయి. భవిష్యత్తులో దళితులు, ఆర్థికంగా వెనుకబడినవారికి న్యాయం చేయాలంటే సాగుపట్టాలను అదే పద్ధతిలో కొనసాగించాలి.

- బుద్ధరాజు రాంబాబు
ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

బాల్య వివాహ రహితంగా రూపొందిద్దాం

నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించి, బాల్య వివాహ రహిత రాష్ట్రాన్ని రూపొందిద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ స్థానిక కోట జంక్షన్ నుంచి టిటిడి కళ్యాణ మండపం వరకు సోమవారం సాయంత్రం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ఈ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ బాల్య వివాహ రహితంగా, మన సమాజాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో బాల్యవివాహాలను చేయబోమని నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే, అధికారులకు ఆ విషయాన్ని తెలియజేసి బాల్య వివాహాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ హిమబిందు, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఝాన్సీ రాణి, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే మార్పు సాధ్యం : కలెక్టర్

చిన్న వయసులో జరిగే వివాహాల వల్ల సామాజికంగా, ఆర్థికంగా, ఆరోగ్య పరంగా కలిగే నష్టాలపై సమాజంలో చైతన్యం తీసుకువచ్చి ప్రజల్లో ఆలోచించేలా చేసినపుడే వీటిని నిరోధించడం సాధ్యమవుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాల్లో మన జిల్లా కూడా వుందని, వీటిని నిరోధించేందుకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు కూడా అవసరమని పేర్కొన్నారు. కైలాష్ సత్యర్థి ఫౌండేషన్ చేపట్టిన బాల్యవివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో భాగంగా బాల్యవివాహాలపై రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలో యీ సంస్థ చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలెక్టర్ బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. 2030 నాటికి రాష్ట్రంలో బాల్యవివాహాలు లేకుండా చేయడమే కైలాష్ సత్యర్థి ఫౌండేషన్ లక్ష్యమని సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి చెప్పారు. జెసి మయూర్ అశోక్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



కోట వద్ద కొవ్వొత్తులప్రదర్శన చేస్తున్న అధికారులు, మహిళా సంఘాల సభ్యులు

విద్యుత్తు భారాలను వ్యతిరేకిస్తూ
వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్‌ఛార్జీల పెంపును నిరసిస్తూ స్థానిక ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యాన సోమవారం ధర్నాచేశారు. ధర్నాను ఉద్దేశించి సిపిఎం నాయకులు పి.శంకర్రావు, సిపిఐ నాయకులు ఎస్.గోపాలం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఎం.గోపాలం మాట్లాడారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు రంగంలో తెస్తున్న సంస్కరణల వల్ల ప్రజలపై తీవ్రభారాలు పడుతున్నాయని, ఈ భారాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

విద్యుత్తు వాడకం పెరగకపోయినా ప్రభుత్వం ఒకేసారి సర్దుబాటు ఛార్జీల పేరుతో మూడు పోట్లు పొడిచిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు షాక్ ఇస్తున్నాయని అన్నారు. గత ఏడాది కరెంటు ఛార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపిందన్నారు. మోడీ, జగన్ కలసి సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. కార్పొరేట్ల దోపిడీ ఆపితే ప్రభుత్వాల అవినీతిని అరికడితే కరెంటు ఛార్జీలు పెంచకుండా తగ్గించవచ్చునని అన్నారు.



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ఈనేపథ్యంలో ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు ఎం.శ్రీనివాస్, కోట అప్పన్న, పికెఎస్ నాయకులు పిల్లా లక్ష్మణరావు, పట్టణ కళాసి సంఘం నాయకులు భోగాది అప్పలస్వామి, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంలో 182 వినతులు

సకాలంలో వినతులు పరిష్కరించకుంటే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వినతులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్.డి.అనిత, ఇతర జిల్లా అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తంగా 182 మంది తమ సమస్యలపై వినతులు ఇచ్చారు.

- నిషేధిత జాబితా నుంచి తమ భూములను తొలగించాలని విజయనగరం మండలం కొండ కారకం గ్రామానికి చెందిన కిలారి వెంకటరమణ, గ్రామ రైతులు కలిసి కలెక్టర్‌కు వినతినిచ్చారు.
- విజయనగరం నియోజక వర్గంలో బెల్టుషాపులను అరికట్టాలని టిడిపి నాయకులు వినతినిచ్చారు. నియోజకవర్గ పరిధిలోగల 3500 బెల్ట్ షాపులను వెంటనే తొలంగించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి , కనకల మురళీమోహన్ పాల్గొన్నారు.
- వ్యవసాయం చేసుకోవడానికి తీగబంద నుంచి వ్యవసాయ భూములకు కాలువ నిర్మించాలని గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌ను కోరారు.
- గతంలో నిర్మించుకున్న గోకులాలకు బిల్లులు చెల్లించాలని వేపాడ మండలం ఎస్ కోట సీతారాంపురం గ్రామానికి చెందిన రైతు గొల్లు ఎర్రన్న కోరారు.
- కొప్పెర్ల గురుకుల పాఠశాలలో వంట మనిషిగా పనిచేసిన తనను తొలగించారని, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా తనకు తిరిగి పని ఇవ్వాలని పూసపాటిరాగ మండలం వెంపడం గ్రామానికి చెందిన డొక్కా రాంబాబు కోరాడు.

అనంతరం ప్రజా వినతుల పరిష్కారంపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. వినతుల పరిష్కారంలో జాప్యం వద్దని పలు మార్లు స్పష్టంచేసినప్పటికీ పలు శాఖల వినతులు పెండింగ్‌లో వుండటంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అర్జీదారుల సంతృప్తి మేరకు పరిష్కరించిన వినతులపై ఆయా శాఖాధిపతులు, మండల ప్రత్యేక అధికారులు నివేదికలు అందించాల్సి వుందన్నారు. భూసేకరణ అధికారులు వెంకటేశ్వరరావు, పద్మలత, సుదర్శన దొర తదితరులు వినతుల స్వీకరణలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులు జీతాలు పెంచాలి

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచి, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.రంగరాజు, బుగత అశోక్, కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

రాష్ట్రంలో భవన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ ఎపి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన 1200 కోట్లు సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఆదిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు జి. శంకర్రావు తదితరులు మాట్లాడారు.

విద్యుత్తు సంస్కరణల రద్దుకు
19న సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ ఛార్జీలను పెంచుతూ తీసుకొస్తున్న సంస్కరణలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న విజయనగరంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకూ విద్యుత్తు బిల్లులు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు షాక్ ఇస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది విద్యుత్తు ఛార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపిందని గుర్తు చేశారు. గత పదేళ్లగా వాడుకున్న కరెంటుకు ప్రజలు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం నెత్తిన తాజాగా రూ.6 వేల కోట్ల భారం వేశారన్నారు. నాలుగేళ్లలో 25 వేల కోట్ల రూపాయలు భారం మోపారని తెలిపారు. ఈనెల బిల్లులో 2014 సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్లీ యూనిట్ కి 20 పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్తు యూనిట్కు మరో 20 పైసలు, 2023 ఏప్రిల్ నెలలో ఉపయోగించిన కరెంటుకు యూనిటుకు 40 పైసలు కలిపి మొత్తం యూనిట్ కు 80 పైసలు చొప్పున జనం నెత్తిన భారం వేశారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తొత్తులుగా మారి టిడిపి, జనసేన పార్టీలు కూడా ప్రశ్నించకుండా పేదలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 19న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి. తులసిదాసు, సి.హెచ్ నర్సింగరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, ఆర్.శంకరరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

మినీ గోకులాల బిల్లులు చెల్లించాలని
కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్నరైతులు

రైతులు నిర్మించుకున్న మినీ గోకులాలకు నాలుగేళ్ళ పూర్తి కావస్తున్న బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని, వెంటనే బిల్లులు చెల్లించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ మినీ గోగులాలు నిర్మించండని చెప్పిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాని, నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గాని సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం రైతులను అన్యాయం చేయడమేనని అన్నారు. అప్పులు చేసి షెడ్ లు నిర్మించిన రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో గతంలో నిర్మించే గోకులాలకు గత మార్చి 30 లోపు నిర్మించిన షెడ్ల స్థితిని పరిశీలించి పేమెంట్లు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నా కింద స్థాయి అధికారులు మాత్రం గోకులాల బిల్లులు పట్టించుకోలేదన్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మిడతాన పరదేశి నాయుడు, కొట్టాన అప్పల నాగేశ్వరరావు, ముమ్ములూరి ఈశ్వరరావు, గొల్లు చంద్రరావు, కిలపర్తి సత్తిబాబు, రొంగళి జగదీష్ తదితరులు పాల్గొన్నారు

రసవత్తరంగా అండర్-19 క్రికెట్ టోర్నమెంట్

8 వికెట్ల తేడాతో అస్సాంపై కేరళ విజయం

ప్రజాశకి-విజయనగరం టౌన్

జిల్లాలో పలు క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న అండర్ 19 వన్డే మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. సోమవారం స్థానిక పివిజి రాజు చింతలవలస క్రికెట్ మైదానంలో అస్సాం జట్టుతో జరిగిన మ్యాచ్ లో కేరళ జట్టు 8 వికెట్లు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అస్సాం జట్టు 34.4 ఓవర్లలో 78 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు 20.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి విజయం సాధించింది. సర్ విజ్జి స్టేడియంలో మధ్యప్రదేశ్ ,మిజోరాం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో మధ్యప్రదేశ్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మిజోరాం 39.4 ఓవర్లలో 71 పరుగులు చేసి ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు 8.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసి విజయం సాధించింది.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ధీరా ఫౌండేషన్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వైసిపి పట్టణ నాయకులు గంటా అప్పలరాజు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధీరా ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ సమకూర్చిన 9 సబ్జెక్టు లతో కూడిన స్టడీ మెటీరియల్, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

'గురజాడ'లో ఆహార దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గురజాడ పాఠశాలలో 'మంచి ఆహారం పదార్థాలు - వాటి ప్రయోజనాలు' అనే కార్యక్రమాన్ని 300 మంది విద్యార్థులతో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములునాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ నేటి చిన్నారులకు మంచి ఆహారం పట్ల అవగాహన లోపించడం, జంక్ ఫుడ్స్ పట్ల వ్యామోహాన్ని పెంచుకోవడం వంటివి అనేక అనారోగ్య సమస్యలకు కారణాలు అవుతున్నాయని అన్నారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం. స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన డ్రైవర్లకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపిఎస్ఆర్‌టిసి హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు సోమవారం ప్రజారవాణా అధికారి అప్పలనారాయణ సర్టిఫికెట్లు అందజేశారు. వీరంతా విటి అగ్రహారంలో గల శిక్షణ కళాశాలలో 13వ బ్యాచ్‌గా శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుశిక్షితులైన ఆర్‌టిసి ఇన్‌స్ట్రక్టర్ల వద్ద శిక్షణ పొందడం వలన క్రమశిక్షణతో కూడిన అలవాట్లు అలవరచుకోవాలన్నారు. భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం జె.శ్రీనివాసరావు, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న 14 వ బ్యాచ్ లో శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు 7382924030 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకర్రావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. విజయనగరం మండలం కొండకరకాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ డివిజి శంకర్రావు మాట్లాడుతూ, వైద్యం చాలా ఖరీదు అయిపోయిన ప్రస్తుత సమయంలో, ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో అవసరమని అన్నారు. ప్రాథమిక వైద్యం నుంచి స్పెషలిస్టు వైద్యం వరకూ గ్రామాల్లోనే అందిస్తూ, కొత్త చరిత్రను సృష్టించారని అన్నారు. మండలానికి రెండు పిహెచ్‌సిలు, ప్రతీ పిహెచ్‌సికి ఇద్దరు డాక్టర్లను ఏర్పాటు చేసి, వైద్యాన్ని గ్రామీణ ప్రజల చెంతకు చేర్చారని చెప్పారు. జిల్లా వాసుల సుదీర్ఘ కలను నెరవేరుస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేశారని అన్నారు. కొన్ని రకాల వ్యాధులను ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యవంతులు కావాలని డివిజి కోరారు. కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, తాహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నడిపేన శ్రీనివాసరావు తదితరులు, మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన ఆరోగ్యమే సురక్ష లక్ష్యం

ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం స్థానిక బాబా మెట్టలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పౌష్టికాహారం విలువలను వివరించే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో ఇప్పటివరకు జరిగిన ఆరు శిబిరాల్లో సుమారు 4వేల మంది వైద్య సేవలు పొందారని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ గాదం మురళి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



రోగులకు మెడికల్ కిట్ అందజేస్తున్న డాక్టర్ డివిజి శంకర్రావు

పలుచోట్ల 'బాబుతో నేను'

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో నీతికి అవినీతికి మధ్య గత 38 రోజుల నుంచి యుద్ధం జరుగుతుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు తెలిపారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా సోమవారం మయూర కూడలి నుంచి రైల్వే స్టేషన్ వరకు విజయనగరం నియోజకవర్గ టిడిపి నాయకులు బాబుతో నేను అనే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నీతి గల వ్యక్తి అయిన చంద్రబాబుకు, అవినీతిపరుడైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మధ్య యుద్ధం జరుగుతు ఒదన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన చంద్రబాబుకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని కాపాడే వ్యక్తి చంద్రబాబును విజయనగరం టిడిపి పార్లమెంటు మహిళా అధ్యక్షులు అనురాధ బేగం తెలిపారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం 41వ డివిజన్ ఇంచార్జ్ అనురాధ (బేగం) ఆధ్వర్యాన పార్టీ కార్యకర్తలు 'హజరత్ గంజ్ సయ్యద్ బాబా' దర్గా వద్ద ప్రార్థనలు చేశారు.



చంద్రబాబుకు మద్దతు కోరుతున్న టిడిపి నాయకులు

18న వైసిపి మండల సమావేశం

రామభద్రపురం: ఈ నెల 18 న స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ఎస్‌వి చినప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న వైసిపి మండల స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు పిలుపు నిచ్చారు. సోమవారం మండల పార్టీ అధ్యక్షులు అప్పికొండ లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలనే దృఢ నిర్ణయంతో ప్రతీ కార్యకర్త ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ఈ సమావేశం ఉపకరిస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు.

వ్యవసాయంపై అవగాహన

బొబ్బిలి రూరల్: మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో భాగంగా వ్యవసాయం పై అలజంగి, ఏ వెలగవలస గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ శాఖ ఎడి యం. శ్యాం సుందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంటల పరిశీలన, విశ్లేషణ విధానాన్ని రైతులతో చేయించామన్నారు. గ్రూపులుగా పొలంలోకి దిగి కనీసం ఐదు దుబ్బులను పరిశీలించి వాటి మీద ఉన్న మిత్ర పురుగులు, శత్రు పురుగులు, వాతావరణం, నీటి వాతావరణం వంటి పరిస్థితులని గమనించి వాటిని ఒక చార్టు పై రాసుకొని ఎటువంటి చర్యలు చేపట్టాలనే సొంత నిర్ణయం తీసుకునే విధంగా రైతులు తయారు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొలంబడి రైతులు, రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు పెంట లత, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం బాధ్యత

బాడంగి: బాల్య వివాహాలను అరికట్టడం సామాజిక బాధ్యత అని ఎంపిపి పక్కి భాగ్యలక్ష్మి అన్నారు. మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం 31 సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను గౌరవించాలనే విషయాన్ని అబ్బాయిలకు చిన్నతనం నుంచే తల్లిదండ్రులు నేర్పించాలన్నారు. కారణాలు ఏమైనా బాల్య వివాహాలు ఎక్కడా జరగకూడదన్నారు. మహిళల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

డెంకాడ : బాల్యవివాహాలను నిర్మూలించాలని ఎంపిఎం విజయలక్ష్మి కోరారు. మండలంలో చింతలవలస, పెద్ద తాడివాడ, మోదవలస, గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్మూలనపై గ్రామ సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీలు, మానవహారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూమ్ మీటింగ్ కూడా నిర్వహించారు. సభ్యులతో ప్రతిజ్ఞలు చేయించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి సూరిబాబు, వివిలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎండిఎం వంట పాత్రల పరిశీలన

నెల్లిమర్ల: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధికారులు కె. రవి జగనన్న గోరు ముద్దలో భాగంగా ఎండిఎం పాత్రలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రల కొలతలు, బరువు కొలిచి నమోదు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత పెంచేందుకు స్టైలెస్ లెస్ మెటల్‌తో వంట పాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. ఎంఇఒ సూర్య నారాయణమూర్తి మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పాత్రలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం జిల్లా అధికారులు సత్యం, కె రామకృష్ణ, సిఐ డిలీప్ తదితరులు పాల్గొన్నారు.

'ఏపికి మళ్లీ జగనే కావాలి'

తెర్లాం: ఏపికి మళ్లీ జగనే కావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో వైసిపి మండల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు అధ్యక్షతన ఏపికి మళ్లీ జగనే ఎందుకు కావాలి? కార్యక్రమంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించబోయే కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా, పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని అన్నారు. ఇంత అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న ప్రతిపక్ష పార్టీలు పనికట్టుకొని విమర్శలు చేస్తున్నాయని వాటిని వైసిపి శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. నవంబర్ 1 నుంచి 40 రోజుల పాటు సచివాలయాల పరిధిలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే నినాదాన్ని స్పష్టంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి చెపేన సత్యనారాయణ, గర్భాపు రామారావు, అప్పలరాజు, మర్రాపు జగన్నాథం పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విజ్ఞానం, వినోదం

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా విజ్ఞానంతో పాటు వినోదాన్ని కూడా అందిస్తున్నామని శాఖ గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులకు అందిస్తున్న విజ్ఞానంలో భాగంగా సోమవారం స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఇంగ్లీష్ లెక్చరర్ పిజితా మోహన్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ చెప్పారు. విద్యార్థులు క్యారం బోర్డ్, చదరంగంతో పాటు ఇతర ఆటలు ఆడిస్తున్నామన్నారు.

18న మెగా వైద్య శిబిరం

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ-అరకు రోడ్డులో గల ఆకుల డిపో వద్ద ఎన్‌టిఆర్ సేవాసమితి ట్రస్టు అండ్ ఎంవివిఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా ఈ నెల 18న నిర్వహించనున్న మెగా వైద్య శిబిరాన్ని అందరూ జయప్రదం చేయాలని టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ కోళ్ల లలిత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యాన్ని కోరుతూ గీతం అధ్యక్షులు మతుకుమిల్లి శ్రీ భరత్ పర్యవేక్షణలో విశాఖపట్నంలో ప్రముఖ గీతం దంత వైద్య కళాశాల అండ్ ఆసుపత్రి, జిమ్ సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల ప్రజలందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

భోగాపురం: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని విజయనగరం డిఎస్‌పి ఆర్. గోవిందరావు అన్నారు. మండలంలోని అవంతి రీసెర్చ్, టెక్నాలజీ అకాడమీలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌తో ఎంతో మంది విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీంతో పెంచిపెద్ద చేసిన తల్లిదండ్రులు కూడా సమాజంలో తలెత్తుకోలేకపోతు న్నారన్నారు. అందుకు విద్యార్థులంతా ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు కలిసిమెలిసి ఉండాలన్నారు. భోగాపురం ఎస్.ఐ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో మనం అందరికి ఆదర్శంగా ఉండాలన్నారు. చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అప్పుడు మిమ్మల్ని చూసి ప్రేరణ పొందాలన్నారు. మనమంటే ఏమిటో చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ర్యాగింగ్ చేస్తే జరిగే నష్టాలు గురించి వివరించారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు..

విజయనగరం టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ కె.సత్యం పట్టణ నిరాశ్రయుల భవనాన్ని సందర్శించి వృద్ధుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులందరికీ పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, దాతలు ఎంతో చెమటోడ్చి కష్టపడి అనాధులకు, మన లాంటి నిరాశ్రయులకు అన్నదానం చేస్తారని అన్నారు. అనంతరం నిరాశ్రయులకు పట్టణ నిరాశ్రయుల భవనం మేనేజర్ త్యాడ రామకృష్ణారావు (బాలు) ఆధ్వర్యాన దుప్పట్లు పంపిణీ చేశారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

విజయనగరం రూరల్: వైసిపి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, ఏ గ్రామంలో చూసినా ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. కోరుకొండలో ఇంటింటికి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని.. జనసేన పార్టీ రూపొందించిన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి కానరావడంలేదన్నారు. పలు గ్రామాల్లో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పారిశుధ్యం లోపించి, దోమలు వృద్ధిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారాయని ఆరోపించారు.


ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి శంబంగి లక్ష్మీ అన్నారు. సోమవారం దిబ్బ గుడ్డి వలస గ్రామంలో జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమంలో పాల్గొని ఆమె రోగులతో మాట్లాడారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణు గోపాల్ నాయుడు, జెడ్‌పిటిసి యస్.శాంత కుమారి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య పరీక్షలపై ఆరా తీశారు. అక్కడున్న కొంతమందిని కలిసి ఆరోగ్య సురక్ష ద్వారా ఏర్పాటు చేస్తున్న రక్త పరీక్షలు గురించి వాళ్ళకి వివరించి చెప్పారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తిమిడి అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపిలు పినిశెట్టి వెంకటరమణ, స్థానిక సర్పంచ్ త్రినాధమ్మ, తిమిడి వెంకటరావు, వసి సర్పంచ్ ఒబ్బిన పార్వతి, ఎంపిటిసి పడాల ధర్మారావు, మండలంలో ఉన్న సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

డెంకాడ: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. జగన్నన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని జొన్నాడలో నిర్వహించిన శిబిరంలో ఆయన పాల్గొని మట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామంలోకి వచ్చి వైద్యం అందిస్తున్న ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, సర్పంచ్‌లు కోరాడ రమణి, కోటి నాయుడు, రమేష్, ఎంపిటిసి త్రిపుర గిరి దేవి, మోపాడ, డెంకాడ పిహెచ్‌సి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజుపురం సచివాలయ పరిధిలో సర్పంచ్ గొటివాడ దేవి, బోజింకి.రామనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిసిసిబి చైర్మన్ వివి చిన్నరామనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మూకల కస్తూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తహశీల్దార్ ప్రసన్నకుమార్, డాక్టర్లు రాజు, సిహెచ్ఒ ఆంజనేయులు, మండల అధ్యక్షుడు మమ్ములూరు జగన్నాథం, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, జెసిఎస్ మండల కన్వీనర్ బోజింకి శ్రీను, సర్పంచుల సంఘం అధ్యక్షుడ నిరుజోగి వెంకట్రావు, వైద్య, సచివాలయ, ఐసిడిసి సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. ఎన్‌కెఆర్‌పురం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరంలో 456 మంది వైద్య సేవలు పొందినట్లు డాక్టర్ కే రాజు, సింహాద్రి నాయుడు, పల్లవి, చాణుక్య తెలిపారు.

బొండపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం పేదలకు వరం అని ఎంపిపి చల్ల చలంనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని బొండపల్లి సచివాలయం-2నకు సంబంధించి బొండపల్లిలో ఎంపిడిఒ వైవి రాజేంద్ర ప్రసాద్ రావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, ఎంఇఒ-2 అల్లు వెంకట రమణ, గృహ నిర్మాణ శాఖ ఎఇ బివి రమణ రాజు, వైస్‌ఎంపిపి గొండెల ఈశ్వరరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఉప సర్పంచ్ కోల వెంకటరమణ, వైద్యాధికారులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని రాజాపులోవ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొని అక్కడకు వచ్చిన వారికి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ కిలారి స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపిడిఒ ఎన్. అప్పలనాయుడు, తహశీల్దారు చింతాడ బంగార్రాజు, వైద్యాధికారి తిరుపతిస్వామి, నాయకులు కిలారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ బకాయిలు చెల్లించకపోతే విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్ యాజమాన్యం పిఎఫ్ బకాయిలు చెల్లించకపోతే విధులు బహిష్కరిస్తామని జ్యూట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు హెచ్చరించారు. పిఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం కార్మికులు స్థానిక జ్యూట్‌మిల్ గేటు వద్ద ఏ, బి షిఫ్ట్ కార్మికులు 1,30గంటల నుంచి 3 గంటల వరకు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కార్మికుల నుద్దేశించి మాట్లడుతూ జ్యూట్ యాజమాన్యం పిఎఫ్ బకాయిలు సంబంధిత అధికారులకు చెల్లించకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. యాజమాన్యం ఇంత వరకు పిఎఫ్ బకాయిలు చెల్లించక పోవడంతో కార్మికులు పింఛన్ సౌకర్యం పొందలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ బకాయిలు, జ్యూట్ యాజమాన్యం రుణంగా తీసుకున్న 5,10,18 రూపాయలు తిరిగి కార్మికులకు చెల్లించక పోయినా సరిపెట్టుకోని పనులు చేస్తుంటే పిఎఫ్ బకాయిలు చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. కాగా పిఎఫ్ బకాయిలు


నెల్లిమర్ల: కార్మికులతో మాట్లాడుతున్న రామారావు

చెల్లించేవరకు ఆందోళన విరమించడం జరగదని చెప్పడంతో జ్యూట్ యాజమాన్యం దిగివచ్చి 2022 డిసెంబర్ వరకు పిఎఫ్ బకాయిలు చెల్లిస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికుల పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శంగవరపుకోట: సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని ఆసుపత్రి సూపరింటెంట్ నీలాకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ 4 నెలల పాటు 16 మంది వర్కర్స్ తో కాంట్రాక్టర్స్ వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అందరూ పేదకుటుంబాల నుంచి వచ్చిన వారేనని వీరంతా కాంట్రాక్టర్ ఇచ్చిన జీతం పై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని ఇప్పటికైనా బకాయి జీతాలు ఈనెల 30 తేదీ లోపు చెల్లించాలన్నారు. వేతనాలు చెల్లించకపోతే వచ్చే నెల ఒకటి నుంచి 6వ తేదీ వరకూ విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న మహారాజా ఆసుపత్రిలో పనిచేస్తున్న వర్కర్లకు నాలుగు నెలల క్రితం వేతనాలు పెంచారని, అలాగే ఎస్‌కోట ఏరియా హాస్పిటల్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్ లందరికీ వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డి గణేష్, ఎం శ్రీను, బి ఈశ్వరి, వి రామచంద్ర, వై అప్పారావు, డి గౌరీ, ఎం రేణుక, ఎం కృష్ణ, వై సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి : ఎమ్‌పి

మెరకముడిదాం: పచ్చని మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పెద్దమంత్రిపేట ఎస్ ఇండియా అధ్యక్షులు, మాజీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ఎస్. హరశ్రీరాములు ఆధ్వర్యంలో బైరిపురం సచివాలయం రోడ్‌లో, పెద్దమంత్రిపేట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఎన్‌ఆర్ కళాశాల, శ్రీహర డిగ్రీ కళాశాలలో డిజిటల్ క్లాస్, స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ కోసం కంప్యూటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంచి ఆరోగ్యవంతమైన జీవితం కోసం, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటాలని తెలిపారు. విద్యార్థులందరూ ఒక గోల్‌ను ఏర్పరచుకొని తమ జీవిత లక్ష్యాలను సాధించుకొని కళాశాలకు అధ్యాపకులకు, తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, బైరిపురం సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉపసర్పంచ్ పప్పల క్రిష్ణమూర్తి, వైస్ ఎంపిపి కందుల పార్వతి, గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జగనన్న లేఅవుట్‌లో ఇల్లు నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులను సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఔట్‌లో ఇల్లు నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారుల డేటాను సమగ్రంగా సిద్ధం చేయాలన్నారు. తదుపరి గృహ ప్రవేశాలకు తేదీ ఖరారు చేసిన రోజున లబ్ధిదారు లందరిని గృహ ప్రవేశాల దగ్గరకు తీసుకురావాలన్నారు. మండలంలో మిగిలి ఉన్న అర్హులకు లేఅవుట్ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అందుకు అవసరమైన స్థల పరిశీలన తహశీల్దార్ రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గడపగడపలో తిరిగినప్పుడు వెయ్యి మందికి పైగా ఇళ్ల స్థలాలు కావాలని తమ నివేదికలు అందాయని వాటిని సచివాలయలలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు ఆన్‌లైన్ చేసి అర్హులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి పినిశెట్టి రమణ, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, రాష్ట్ర ఫోక్స్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పోతనపల్లి కూనిరెడ్డి వెంకటరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రెహ్మాన్, ఎంపిటిసి కడారి అప్పయ్య, కడారి జై శంకర్, కొట్టం ఎంపిటిసి చప్ప భాస్కర్ రావు, వీరనారాయణం సోంబాబు, దారపర్తి సర్పంచ్ బి. సన్యాసిరావు, పినగంటి జగదీష్ పాల్గొన్నారు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

పట్టణంలోని సచివాలయం-3 పరిధిలోని మునసబు వీధి నుండి 3 చింత చెట్లు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, రాష్ట్ర ఫోక్స్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పార్వతి, వార్డు మెంబర్లు మజ్జి శేఖర్, భారతి, ఈశ్వరి, బొబ్బిలి ఎర్నమ్మ, పొడుగు సంతోష్, సరిపల్లి గణేష్, ఎంపిటిసి కడారి అప్పయ్య, కడారి జయశంకర్, సీతంపేట నాయకులు చింతల నారాయణ మూర్తి, ఈశ్వర అప్పల నాయుడు, చిప్పాడ వెంకటరమణ, వేమలి జగదీష్, యలమంచిలి అప్పల సత్యం, యలమంచిలి ఈశ్వరరావు, యలమంచిలి రాంబాబు, నక్కరాజు నాగరాజు, పినగంటి జగదీష్, సోషల్ మీడియా కన్వీనర్ మామిడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలు విస్తరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలు విస్తరించేలా విద్యార్థులు కృషి చేయాలని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏటా మోర్టన్ గౌరవార్థం అక్టోబర్ 16న అనస్థీషియా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటు న్నామన్నారు. ఈ ఏడాది 'అనస్థీషియా, కేన్సర్ కేర్' అనే థీమ్‌తో అన్ని చోట్ల కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. ఎన్‌ఆర్ఐ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నేడు ఆసుపత్రులలో సాంకేతిక నిపుణుల కొరత ఉందన్నారు. ఈ కోర్సు నేర్చుకుంటున్న విద్యార్థులకు ఉజ్వల భవి ష్యత్ ఉందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ క్లినికల్ ప్రాక్టీస్ తప్పనిసరిగా నేర్చుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుంద న్నారు. అనంతరం గోడ పత్రిక ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, చైతన్య, ముఖేష్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విసి మహంతి

బొబ్బిలి: శస్త్ర చికిత్సల నిర్వహణలో నొప్పిని తగ్గించటానికి, వ్యక్తి ఆందోళన తగ్గించడానికి ప్రధాన భూమిక అనస్థీషియాదేనని బొబ్బిలి సామాజిక ఆరోగ్య కేంద్ర అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ కె. రాజా రమేష్ అన్నారు. వరల్డ్ అనస్థీషియాడే సందర్భాన్ని పురస్కరించుకొని బొబ్బిలి రోటరీ క్లబ్, హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. శశిభూషణ రావు ఆధ్వర్యంలో రోటరీ అధ్యక్షులు జెసి రాజు, కార్యదర్శి శ్రీహరి, రీజినల్ చైర్ గెంబలి శ్రీనివాసరావులు బొబ్బిలి సిహెచ్‌సిలో అనస్థీషియాగా సేవలందిస్తున్న డాక్టర్ రాజా రమేష్‌ను సోమవారం దుస్సాలు వాతో సత్కరించి జ్ఞాపికను అందించారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - భోగాపురం

మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం గ్రామంలోని సింగిల్ చెరువులో స్వదేశీ మత్స్యకారులకు ఉచితంగా అందజేసిన చేపపిల్లలను ఆయన చేతులు మీదుగా సోమవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వదేశీ, విదేశీ మత్స్యకారులను ప్రభుత్వం ఎంతో ఆదుకుందన్నారు. కాని మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన మత్స్యకారులు ప్రతి ఎన్నికల్లోను ఇంకా తెదేపాకే మొగ్గు చూపుతున్నారన్నారు. ఈసారి అలా జరక్కుండా చూడాలని మత్స్యకార నాయకులకు సూచించారు. భోగాపురం మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి రూ.1.50లక్షల విలువైన 84వేలు చేప పిల్లలను ఉచితంగా అందజేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘం నాయకులు బర్రి చిన్నప్పన్న, జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మల, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చాందిని, డైరెక్టర్ మైలపల్లి నర్సింహులు, నాయకులు పడాల శ్రీనివాసరావు, కొమ్మూరి సుభోషణరావు, సుందర హరీష్, పడాల భాను, పాలెపు కనకరాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


చెరువులో చేపలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

డిఎంఎస్‌తో ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తవలస

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్లో లోపాలను పరిశీలన చేసేందుకు, వాటిని గుర్తించేందుకు డ్రోన్ మానటిరింగ్ సిస్టమ్ (డిఎంఎస్)ను ప్రభుత్వం ప్రవేశపెడుతుందని ఎన్‌ఆర్ఈజిఎస్ అంబుడ్స్ పర్సన్ అన్నపూర్ణ శత్పతీ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 25 గ్రామ పంచాయితీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.21 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులపై డ్వామా ఎపిడి జనార్ధనరావు, డివిఒ రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డ్రోన్ మానటిరింగ్ సిస్టమ్ ద్వారా అభివృద్ధి పనుల్లోని నాణ్యత, అవతవకలు, దుర్వినియోగం వంటి అంశాలు సునాయాసంగా తెలుసుకోవచ్చాన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది సోషల్ ఆడిట్‌ను సీరియస్ తీసుకుని పనిచేయాలని, ప్రజాధనం ప్రతీ ఒక్క రూపాయికీ బాధ్యత వహించాలని సూచించారు. 25 పంచాయితీల్లో గతనెల 30 నుంచి 8మంది డిఆర్‌పిలు నిర్వహించిన సామాజిక తనిఖీపై సభలో చర్చించారు. వేతనాదారుల చెల్లింపులు, బిల్లుల మంజూరు తదితర అంశాలను పరిశీలించి ఉపాధిహామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, సర్పంచులు విరోతి కొండలరావు, కోన దేముడు, ఎన్‌ఆర్ఈజిఎస్ అంబుడ్స్ పర్సన్ కె. సన్యాసిరాజు, ఎంపిడిఒ వై.పద్మజ, ఎస్‌ఆర్‌పి ఎస్. అచ్యుతరావు, ఎపిఒలు వై. జనార్ధన్, విజయలక్ష్మి, ఈసీలు వరలక్ష్మి, కేశవ, టీఏలు జగన్, ఎర్నిబాబు, ఇందు, ఎర్నమ్మ, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అన్నపూర్ణ శత్పతీ

ప్రజల చెంతకు పాలన

ప్రజాశక్తి - జామి

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజల చెంతకు పాలన అందుతుందని, పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్య మంత్రి చేసి చూపించారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న గృహ నిర్మాణ సంబరాల్లో భాగంగా సోమవారం అలమండ గ్రామంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మండలంలోని 13 గ్రామాల గృహ లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆర్థిక పరిపుష్టిని మెరుగుపరిచిన జగనన్న ప్రభుత్వాన్ని మళ్ళీ ఆశీర్వాదించాలన్నారు. నియోజకవర్గంలో సుమారుగా 14వేలు గృహ నిర్మాణాలు మంజూరు చేశామని, ఒక్క జామి మండలంలోని 1300కు పైగా ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, అందరి ప్రభుత్వంగా వైసిపి పాలన ఉందని, రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగన్ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ రాఘురాజు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరిన ఇళ్లు లక్షల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అరుణ, జెడ్‌పిటిసి సరయు, వైసిపి మండల కన్వీనర్ రవికుమార్, మాజీ ఎంపిపి సూరిబాబు రాజు, ప్రచార కమిటీ అధ్యక్షులు గుడివాడ రాజేశ్వరరావు, తహశీల్దార్ హేమంత్ కుమార్, అలమండ వైస్ సర్పంచ్ దేముడు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

విద్యుత్తు శాఖ డిఇ ఆవాల అనంతరావు

బొబ్బిలి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎపిఇపిడిసిఎల్ డిఇ ఆవాల అనంతరావు అన్నారు. బొబ్బిలిలో డిఇగా పని చేసిన పూడి హరి విజయనగరం టౌన్ డిఇగా బదిలీ కావడంతో బొబ్బిలి డిఇగా అనంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి 9 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అనుమానాస్పద మృతి

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక శ్రీనివాసకాలనీలో తమిళనాడు రాష్ట్రం ధర్మవరానికి చెందిన పెరుమల్ల గుణ (27) అనుమానస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమల్ల గుణ అనే యువకుడు పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద హాట్‌షిప్స్ దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం రాత్రి పట్టణంలోని శ్రీనివాస కాలనీలో అద్దెకున్న గృహంలో గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ దుర్మరణం

రామభద్రపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందారు. ఆరికతోట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి మహిళ మృతి చెందినట్లు గుర్తించిన వాహన దారులు ఇచ్చిన సమాచారం మేరకు ఏఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈమె గత కొన్నాళ్లుగా ఇక్కడ ఇంటింటా ముష్టి ఎత్తుకొని పొట్ట పోసుకునే అనాథ అని చెప్పుకుంటున్నారు. ఈమె మృతికి కారణమైన వాహన ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

భోగాపురం : మండలంలోని మహారాజపేట జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం పట్టుకుని అరెస్టు చేశామనిఎస్ఇబి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. హెచ్‌సిలు సింహాచలం, వసంత కుమార్ తనిఖీలు చేయగా కొయ్య ప్రసాద్ అనే వ్యక్తి ఆరు మద్యం సీసాలతో పట్టుబడ్డారని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టు తరలించామన్నారు.